# ఆడబిడ్డకు అండగా బీఆర్ఎస్ సర్కారు



చెక్కు అందజేస్తున్న మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

- దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాల అమలు
- వచ్చే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి.. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా
- మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంటలో పర్యటన.. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జమ్మికుంట, సెప్టెంబర్ 30: ఆడబిడ్డకు బీఆర్ఎస్ సర్కారు అండగా నిలుస్తున్నదని, దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మండలి విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని, మూడోసారి సీఎంగా కేసీఆరే అధికారంలో ఉంటారని స్పష్టం చేశారు. శనివారం మండలి విప్ జమ్మికుంట మున్సిపల్‌లో పర్యటించారు. 30 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువా కప్పి, సన్మానించారు. స్వీట్లను అందిస్తూ చెక్కులను చేతిలో పెట్టారు. తర్వాత ఆయన ఆయా చోట్ల మాట్లాడారు. ఆడబిడ్డ పుడితే బాధపడే రోజులు పోయాయని, కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో ప్రజలు ఆనందంగా ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నాయని ఉద్ఘాటించారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంగా నియోజకవర్గంలోనే తిరుగుతున్నానని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నానని పేర్కొన్నారు. కేసీఆర్ తనకు మండలి విప్‌గా అవకాశం ఇచ్చారని, ఇంతకంటే గొప్ప పదవి తనకేం అవసరం లేదన్నారు. అయితే ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని, అందుకు కారణం గతంలో ఇక్కడ పనిచేసిన ఎమ్మెల్యేనే కారణమన్నారు. ఇప్పుడూ కూడా ఎమ్మెల్యేగా ఉండి కనీసం ప్రజలను కలువడం లేదని, సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మంత్రిగా పనిచేసిన ఆయన, అభివృద్ధి ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పనిచేయని, ప్రజలతో సంబంధాల్లేని నాయకుడు మనకు అవసరమా..? చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి, అసెంబ్లీకి పంపాలని కోరారు. నియోజకవర్గంలో నిధుల వరద పారిస్తానని, అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని తెలిపారు. మరో సిరిసిల్ల, సిద్దిపేటగా మారుస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు మండలి విప్ పర్యటన సందర్భంగా ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టి, ఆశీర్వదించారు. మండలి విప్ వెంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, పలు వార్డులకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు, తదితరులున్నారు.

## సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



ఎమ్మెల్యే జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, సెప్టెంబర్ 30: వరుసగా మూడోసారి బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వొడితల సతీశ్‌కుమార్‌ను ప్రకటించడం హర్షణీయమని, రానున్న ఎన్నికల్లో ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సతీశ్‌కుమార్‌ను మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండ గణేశ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ రావుల రవీందర్‌రెడ్డి, జిల్లా సభ్యుడు చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేబర్ కార్డులను రెన్యువల్ చేసుకోవాలి



మాట్లాడుతున్న సహాయ కార్మిక శాఖ అధికారి డీ చందన

హుజూరాబాద్‌టౌన్, సెప్టెంబర్ 30: కార్మిక శాఖ ద్వారా లేబర్ కార్డు పొందిన ప్రతి కార్మికుడు తప్పనిసరిగా గడువులోగా రెన్యువల్ చేసుకోవాలని హుజూరాబాద్ సహాయ కార్మిక శాఖ అధికారి డీ చందన తెలిపారు. శనివారం కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లేబర్ కార్డు రెన్యువల్ చేసుకోని యెడల కార్మిక సంక్షేమ శాఖ ద్వారా లభించే ప్రయోజనాలకు అనర్హులు అవుతారని పేర్కొన్నారు. గతంలో కరీంనగర్‌రోడ్‌లో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాన్ని పట్టణంలోని మున్సిపాలిటీ రోడ్డులో రామలింగారెడ్డి దవాఖాన ఎదురుగా ఉన్న 19-13 నంబర్ భవనంలోకి మార్చినట్లు తెలిపారు. కార్మికులంతా గమనించాలని కోరారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్షుడికి సన్మానం



కొండ గణేశ్‌ను సన్మానిస్తున్న శీల శ్రీనివాస్

హుజూరాబాద్, సెప్టెంబర్ 30: సైదాపూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన వెన్కెపల్లి సర్పంచ్ కొండ గణేశ్‌ను హుజూరాబాద్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శీల శ్రీనివాస్ సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## వాడవాడలా 'స్వచ్ఛతా హీ సేవా'




28వ వార్డులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, సెప్టెంబర్30: పట్టణంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి మున్సిపల్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వాడవాడలా పరిశుభ్రతపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే చీపురు పట్టి రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్ సమ్మయ్య, కౌన్సిల్ సభ్యులు, వార్డుల ప్రత్యేక అధికారులు, సీఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఎంపీపీకి ఆశ కార్యకర్తల వినతి

సైదాపూర్, సెప్టెంబర్ 30: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు మండలకేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద శనివారం ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఎంపీపీని కోరారు.

## ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 30: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రొడ్డవేని సిరివెన్నెల, ఎండీ సానియా పాల్గొని ప్రతిభ చూపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థినులను సర్పంచ్ రావుల రమేశ్, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ బేటి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు బన్సీలాల్‌ను ప్రధానోపాధ్యాయుడు వీ రవీందర్ అభినందించారు.

## సర్వాయి పాపన్న గుట్టలను పరిరక్షించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

హుజూరాబాద్‌టౌన్, సెప్టెంబర్ 30: సర్వాయి పాపన్న గుట్టలను పరిరక్షించాలని శనివారం హుజూరాబాద్‌లో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట సైదాపూర్‌రోడ్‌లో గల సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత కేసీక్యాంప్‌లోని ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని, కార్యాలయ ఇన్‌చార్జి కే విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, గ్రానైట్ మాఫియా నుంచి సర్వాయి పాపన్న గుట్టలను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి మేడగోని బుచ్చయ్యగౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌పర్సన్ కొలిపాక నిర్మల, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కలర్(ఘనగాని) సత్తయ్యగౌడ్, గౌడ ఐక్యచైతన్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్క అనిల్‌గౌడ్, కౌన్సిలర్, గౌడ సంఘం జిల్లా నాయకుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ నాయకుడు వడ్లకొండ కిరణ్‌గౌడ్, గౌరవ సలహాదారు గోపగోని సారయ్యగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి పరశురాములుగౌడ్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడు పెరమండ్ల సదయ్యగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మెడగొని శ్రీనివాస్‌గౌడ్, హుజూరాబాద్ పట్టణాధ్యక్షుడు బుర్ర కుమార్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## మన రజకసంఘం మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్



పున్నం శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నాయకులు

సైదాపూర్, సెప్టెంబర్ 30: మన రజకసంఘం మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో రజక కులస్తులు ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవాధ్యక్షుడిగా సోమారపు రాజయ్య, మండలాధ్యక్షుడిగా పున్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బోనాల శ్రీనివాస్, మునిగంటి సంపత్, చిక్కుల సంపత్, ప్రధాన కార్యదర్శిగా పైడిపల్లి అరవింద్‌కుమార్, కార్యదర్శులుగా ఎజ్జ రమేశ్, సంగ కుమార్, కోశాధికారిగా వల్లెపు రాజు, సహాయ కార్యదర్శులుగా సోమారపు కుమారస్వామి, బాసరాజు తిరుపతి, పైడాకుల సంపత్, సంగ కార్తీక్, గూడెం శ్రీనివాస్, తంగల్లపల్లి శ్రీనివాస్, కారంకంటి రాజు, పున్నం సదానందం, కొలిపాక అంజి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## ఇంటికి తాళం వేసిన భర్త: నిరాశ్రయులైన భార్యాబిడ్డ

వీణవంక, సెప్టెంబర్ 30: కుటుంబ తగాదాలతో భర్త ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోగా, భార్యాబిడ్డ నాలుగు రోజులుగా ఇంటి ఎదుటే నిరాశ్రయులుగా పడిగాపులు కాస్తున్నారు. బేతిగల్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంబాల పద్మ-కుమారస్వామి దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు ఉద్యోగంపై విదేశాలకు వెళ్లగా, కూతురు రమ్యశ్రీ డిగ్రీ పూర్తి చేసింది. దంపతుల మధ్య ఆరు నెలలుగా గొడవలు జరుగుతుండగా, పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో ఇంట్లో దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నెల 27న కుమారస్వామి తనతోపాటు కూతురును ఇంటి బయట ఉంచి తాళం వేసుకొని వెళ్లిపోయాడని పద్మ ఆవేదన వ్యక్తం చేసింది. నాలుగు రోజులుగా ఇంటి ముందే ఉంటున్నామని వాపోయింది. అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని తల్లీకూతురు కోరుతున్నారు.

## పారిశుధ్య సిబ్బందికి ఉచిత హెల్త్ చెకప్



పారిశుధ్య సిబ్బందికి హెల్త్ చెకప్ చేస్తున్న వైద్యురాలు, సిబ్బంది

హుజూరాబాద్‌టౌన్, సెప్టెంబర్ 30: పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి శనివారం హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్యురాలు డా. జరీన, పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ వార్డు సభ్యుడు ముక్క రమేశ్, కమిషనర్ సల్వాది సమ్మయ్య, ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఇన్‌చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ జీ సాంబరాజు, టీపీఎస్ ఎన్ అశ్వినీగాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.